క్లుప్తంగా

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో 2023– 24 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి 10వ తరగతిలో చేరుటకు అడ్మిషన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ ఐతరాజు సుధాకర్ బుధవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం



శేఖర్‌రెడ్డికి ఆర్థికసాయం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్స్

కోదాడఅర్బన్ : ఫొటోగ్రాఫర్స్ కుటుంబ భరోసా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కూకుంట్ల లాలు అన్నారు. కోదాడకు చెందిన ఫొటోగ్రాఫర్ మర్ల శేఖర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఆయనకు ఫొటోగ్రాఫర్స్ కుటుంబ భరోసా పథకం నుంచి రూ.10,000ల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వంగూరు యాదగిరి, బొమ్మల వెంకన్న, గొట్టం రవి, వెంకట్, మరికంటి లక్ష్మణ్, ఉపేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నాగరాజు



నాగరాజుకు నియామకపత్రం ఇస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటమయ్య

మఠంపల్లి : టీఎమ్మార్పీఎస్ మఠంపల్లి మండల అధ్యక్షుడిగా రెడపంగు నాగరాజు మాదిగ నియమితులయ్యారు. టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆదేశాల మేరకు బుధవారం మఠంపల్లిలో ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెదపంగు కాటమయ్య నాగరాజుకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాబుమాదిగ, లోకేష్‌మాదిగ, శ్రీనుమాదిగ, కాశయ్య, ముత్తయ్య, నవీన్, రాజేష్, కృష్ణ, భిక్షం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, సంఘం నాయకులు

గరిడేపల్లి : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ఎస్టీయూ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీపీ పెండెం సుజాత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎస్టీయూ సంఘం క్యాలెండర్‌ను తహసీల్దార్ కవిత, ఎంఈఓ చత్రునాయక్‌తో కలిసి ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తూరి భిక్షం, గొర్రె నాగరాజు, పాలూరి అంజయ్య, కేవీ సత్యనారాయణ, బెక్కం రాంబాబు, అనంతుల రామారావు, సత్రు, సత్యనారాయణ, ఎల్లయ్య, గోవిందు, మధు తదితరులు పాల్గొన్నారు.

యాతవాకిళ్లలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 13నుంచి 16 వరకు బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు తెలిపారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, మూడవ బహుమతి రూ.10వేలు, నాలుగవ బహుమతి 5వేలు, షీల్డ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సెల్ 9347894644, 6302491550 లను సంప్రదించాలని కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కోలాహలం కృష్ణంరాజు, కె. లక్ష్మణ్‌రాజు, సైదాహుస్సేన్ తదితరులు ఉన్నారు.

దర్గా వద్ద కాంట్రాక్టర్ల దోపిడీని అరికట్టాలి

హుజూర్‌నగర్ : త్వరలో జరిగే ఉర్సు ఉత్సవాల్లో జానపహాడ్ దర్గా కాంట్రాక్టర్ల దోపిడీని అరికట్టాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కులు చెల్లించుకునేందుకు దర్గాకు వచ్చే భక్తుల నుంచి అదనపు ట్యాక్స్ పేరుతో కాంట్రాక్టర్లు దండిగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కొండమిది నర్సింహారావు, వట్టెపంగు సతీష్, సాయి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను కమ్మేసిన కంపచెట్లు



చిలుకూరు - దూదియాతండా రోడ్డులో కంపచెట్లతో కమ్మేసి ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



దూదియాతండా గ్రామ శివారులో..

- మూలమలుపుల్లో చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- చెట్లను తొలగించాలని వాహనదారుల వేడుకోలు

చిలుకూరు : మండలంలో గ్రామాలను కలిపే లింక్ రోడ్ల వెంట కంపచెట్లు ఏపుగా పెరిగి ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అసలే ఈరోడ్లు అధ్వానంగా మారడంతో పాటు మూలమలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. దీనికి తోడు కంపచెట్లు కమ్మేయడంతో వాహనదారులు ఈ రహదారులపై ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. ముఖ్యంగా చిలుకూరు నుంచి దూదియాతండా రోడ్డు, దూదియాతండా నుంచి జానకీనగర్ రోడ్డు, దూదియాతండా నుంచి నారాయణపురం రోడ్డు, సీతారాంపురం (జాతీయ రహదారి) నుంచి నారాయణపురం రోడ్డు వెంట కంపచెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు వెంట ఉన్న కంపచెట్లను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



సీతారాంపురం - నారాయణపురం రోడ్డులో..

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

మేళ్లచెరువు : గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది కేఎల్ఎన్. ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని వెల్లటూరు గ్రామ పరిధిలో నిర్వహించిన గీత కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురైన కార్మికులను పరామర్శించారు. కార్యక్రమంలో వెంకన్న, దాసు రామయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లు, శ్రీను, వీరాంజీ, కొండల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఎల్ఎన్ ప్రసాద్

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. ఇవి పాటించండి



మాట్లాడుతున్న ఎస్ఐ పరమేష్

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల ప్రజలు సంక్రాంతికి వేరే ప్రాంతానికి వెళితే జాగ్రత్తలు పాటించాలని నేరేడుచర్ల ఎస్ఐ పచ్చిపాల పరమేష్ సూచించారు. బుధవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగల సమయంలో దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారని, కావునా ఊర్లె వారు విలువైన వస్తువులు, డబ్బు ఇంట్లో ఉంచకుండా లాకర్లల్లో భద్రపరుచుకోవాలన్నారు. ఊర్లె వారు సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టుకోవద్దని సూచించారు. ఊర్లె వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తామని చెప్పారు.

నగదును లాకర్లలో భద్రపరుచుకోవాలి

గరిడేపల్లి : సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని, సంక్రాంతికి ఊరెళ్తున్న వారు విలువైన వస్తువులు, డబ్బును ఇంట్లో ఉంచకుండా లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఊరెళ్తున్నట్లు పోస్ట్ చేయవద్దని, ఊర్తే ముందే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం



కోటి దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

హుజూర్‌నగర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలో ప్రాతః కాలార్చన, తిరుప్పావై సేవాకాలం, పూలు, పండ్లతో అర్చనను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆంజనేయ స్వామి మండపంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఉభయ దేవేరులైన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని పల్లకీలో అధిష్ఠింపజేసి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ గావించారు. శ్రావ్యంగా సాగిన నాదస్వర కీర్తనలు పలువురు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అర్చకులు, స్థానాచార్యులు, అధికారులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

గరిడేపల్లి : కల్మలచెరువు, పొనుగోడు, కీతవారిగూడెం గ్రామాల్లో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం పొనుగోడులోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు అలహరి నరసింహాచార్యులు, సుదర్శనం శ్రీనివాసాచార్యులు, రాయపోలు శ్రీరామశర్మ, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ బలరాంరెడ్డి

హుజూర్‌నగర్ : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ బలరాంరెడ్డి సూచించారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు మందులతో ఎంతో మంది జీవితాలు నాశనం అవుతున్నాయని, విద్యార్థులు అలాంటి వాటి జోలికి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం పోలీస్ కళాబృందం సైబర్ నేరాలు, సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్స్, టోల్ ఫ్రీ నంబర్ 1930, పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం గురించి ఆటాపాటలతో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వీడీఎస్ ప్రసాద్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసరెడ్డి, పోలీస్ సిబ్బంది నాగరాజు, రాము, సత్యనారాయణ, నరసింహ, శ్రీను, కళాబృదం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, క్రిష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు



నేరేడుచర్లలోని ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ సంధ్యారాణి

నేరేడుచర్ల : ఎరువుల దుకాణాల్లో రికార్డులు సక్రమంగా లేకుంటే దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు సంధ్యారాణి హెచ్చరించారు. బుధవారం నేరేడుచర్లలోని పలు ఎరువుల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో రికార్డులు సక్రమంగా నమోదు చేయకుంటే దుకణాలకు ఎరువుల సరఫరా నిలిపివేయిస్తామన్నారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు సాగు నీరు విడుదల కాకపోవడంతో హుజూర్‌నగర్ డివిజన్ పరిధిలో ఉన్న 1.39 లక్షల ఎకరాల్లో వానాకాలం సీజన్‌లో 1.18 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేపట్టారని తెలిపారు. ప్రస్తుత ఎండాకాలం సీజన్‌లో 80వేల ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో ఎరువుల కొరత లేదని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

అయ్యప్ప సన్నిధానంలో ముగిసిన అన్నదానం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. చివరిరోజు కావడంతో సన్నిధానంలో అర్చకులు వివేక్, సీనియర్ గురుస్వాములు స్వామివారికి 18 రకాల పుష్పాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 52 రోజులుగా దాదాపుగా 20వేల మంది అయ్యప్ప మాలధారులతో పాటు శివ, అమ్మవారి, వేంకటేశ్వర స్వామి మాలధారులకు అన్నదానం చేసినట్లు వారు తెలిపారు. గత తొమ్మిదేళ్లుగా అన్నదానానికి సహకరిస్తున్న దాతలు, మాలధారులు , మిత్రులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, బర్మావత్ సీతారాంసింగ్, సూర్యారెడ్డి, రంగా, నాగరాజు, మాలధారులు ఉన్నారు.



అన్నదానం చేస్తున్న దాతలు, నిర్వాహకులు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు.. ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వపరిపాలన వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అయోధ్య శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



చిలుకూరులో శ్రీరామ జన్మభూమి అంక్షితలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్న మహిళలు

చిలుకూరు : చిలుకూరు గ్రామంలో బుధవారం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం ఉన్నట్లు తెలిపారు. రామాలయ నిర్మాణం మంచి పరిణామం అని అన్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

విభళాపురంలో..

మోతె : మండలంలోని విభళాపురం గ్రామంలో అయోధ్య శ్రీరాముని అక్షింతలను బుధవారం రామాలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శ్రీరామ నామ కీర్తనతో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏపూరి వీరస్వామి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అర్వపల్లి దర్గాకు కాంగ్రెస్ నాయకుడి పాదయాత్ర

మునగాల : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతిరెడ్డి గెలిస్తే అర్వపల్లి దర్గాకు పాదయాత్ర చేస్తానని మొక్కుకున్న కోదాడకు చెందిన కుడుముల శ్రీనివాసరావు బుధవారం పాదయాత్రగా దర్గాకు బయలుదేరాడు. మునగాల మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరావుకు ఘన స్వాగతం పలికి పూలమాలలో సన్మానించారు. కార్యక్రమంలో ఎండి.రషీద్, పి.జాను, గట్టు వెంకన్న, జిల్లా జాను, రామకృష్ణ, మహేష్, జయరాజ్, రాజేంద్రప్రసాద్, నరేష్, నరేందర్, సుధీర్ ఉన్నారు.



స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

సంస్కృతి, సంప్రదాయాలను నేర్వాలి

కోదాడఅర్బన్ : పిల్లలకు విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పాలని కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం స్థానిక అక్షయ ఐఐటీ ఫౌండేషన్ పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆమె తిలకించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ బీడ్ల లక్ష్మీనర్సింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పురప్రముఖులు పాల్గొన్నారు.



కోదాడఅర్బన్: ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

ఎస్ఆర్ఎం పాఠశాలలో..

కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎం పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి మాట్లాడుతూ పిల్లలకు బాల్యం నుంచే పండుగల విశిష్టత, సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలు హరిదాసు వేషధారణలో ఆకట్టుకున్నారు. భోగిమంటలు వేశారు. ముగ్గులు వేశారు. పిల్లలకు భోగిపండ్లు పోశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ఎం పాఠశాలలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న కేశినేని శ్రీదేవి తదితరులు

గురుకులంలో ముగ్గుల పోటీలు

నడిగూడెం : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఏ.రేణుక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రైట్ బీస్ పాఠశాలలో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని బ్రైట్ బీస్ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో రంగులతో ముగ్గులు వేసి అలంకరించారు. బొమ్మల కొలువులు, నృత్యాలు, సంప్రదాయ దుస్తులలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ జెండా



కోదాడఅర్బన్ : ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని సన్మానిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు

- కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి

కోదాడ : పేదలకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ జెండా అండగా ఉంటుందని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం కోదాడ పట్టణ పరిధిలోని 34వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. పద్మావతి గెలిచిన సందర్భంగా కోదాడ నుంచి అర్వపల్లి దర్గాకు పాదయాత్ర చేపట్టిన కాంగ్రెస్ కార్యకర్త కుడుముల శ్రీనివాసరావుతో కలిసి కాసేపు పాతయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గంధం యాదగిరి, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ఏర్నేని బాబు, మహబూబ్‌జానీ, పారా సీతయ్య, కందుల కోటేశ్వరరావు, షమ్మి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోదాడ : 34వ వార్డులో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

కోదాడఅర్బన్ : రిటైర్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం కోదాడలో ఎమ్మెల్యేను విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాటు కోదాడలో తాను అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు విశ్రాంత ఉద్యోగులు చేసిన సహకారం మరువలేదన్నారు. పెన్షనర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. కోదాడలో సీనియర్ సిటిజన్స్ కోసం వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తానన్నారు. అంతకుముందు జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా నకార విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆర్.సీతారామయ్య, మల్లెంపల్లి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, వంగవీటి రామారావు, పారా సీతయ్య, ప్రసన్న, సంఘం సభ్యులు లక్ష్మీనర్సయ్య, రాంబాబు, సుదర్శన్‌రెడ్డి, వరప్రసాదరావు, విద్యాసాగర్‌రావు, నర్సయ్య, భ్రమరాంబ, తదితరులు పాల్గొన్నారు.

అంతిమ దశకు ఎస్సీ వర్గీకరణ పోరాటం

చిలుకూరు : మంద కృష్ణమాదిగ నాయకత్వంలో చేపడుతున్న ఎస్సీ వర్గీకరణ సాధన పోరాటం అంతిమ దశకు చేరుకుందని ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్‌లు తూరుగంటి అంజయ్య మాదిగ, ఏపూరి రాజు మాదిగ తెలిపారు. బుధవారం చిలుకూరులో ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్ఎఫ్ మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వర్గీకరణ సమస్య పరిష్కారానికి చట్టం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్సీ వర్గీకరణపై విజయం సాధించేవరకు యావత్ మాదిగ జాతి పోరాడుదామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎస్పీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్, జిల్లా, మండల నాయకులు యలమర్తి రాము మాదిగ, సిద్దెల శ్రీను, మాతంగి రవి, షేక్ మౌలానా, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరిబాబు, నాయకులు మీసాల భగత్, వంగూరి రమేష్, మెరిగె రామారావు, కందుకూరి శ్రీను, వంగూరి రాంబాబు, రామారావు, అంజిబాబు, ఉపేందర్ పాల్గొన్నారు.



చిలుకూరులో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

వేణుగోపాలస్వామి ఆలయానికి సౌండ్ సిస్టం బహూకరణ

హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీగోదాదేవికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమండ్రి వాస్తవ్యులు లట్టాల వెంకటఫణి, మారుతి రాకేష్‌శర్మ రూ.50 వేల విలువ గల సౌండ్ సిస్టంను ఆలయ ఈఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈవో ఎంపి లక్ష్మణరావు, అర్చకులు ధర్మకర్తలు పాల్గొన్నారు.



ఆలయానికి సౌండ్ సిస్టం అందజేస్తున్న దాతలు

సంక్షిప్త సమాచారం

కంటి వైద్య శిబిరం

మేళ్లచెరువు : మండల కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, కొందరిని మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు రిఫర్ చేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనర్సింహరెడ్డి, శ్రీనివాస్, డాక్టర్ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురంలో గ్రామానికి చెందిన డాక్టర్.జంపాల శ్రీనివాస్ తన కూతురు డాక్టర్.తేజస్వి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పాస్టర్ నవీన్, సంధ్య, రవితేజ, ధరణి పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఊహలకు రెక్కలొస్తే' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉన్నట్లు ప్రధానోపాధ్యాయుడు పి.నారపరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తక ఆవిష్కరణలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ పాల్గొనాలని కోరారు.

పత్తికి మద్దతు ధర ఇవ్వాలి

నడిగూడెం : పత్తికి మద్దతు ధర ఇవ్వాలని కరివిరాల సీపీఎం గ్రామ కార్యదర్శి ఎస్‌కె.మస్తాన్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కరివిరాలలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకూ పత్తి సాగుకు పెట్టుబడులు పెరుగుతున్నాయని, దీంతో పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం స్పందించి పత్తికి క్వింటాకు రూ.10,500ల మద్దతు ధర పెంచాలన్నారు. ఈ సమావేశంలో కేశగాని భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి శుభాకాంక్షలు

కోదాడరూరల్ : కోదాడ ఎంపీపీగా నూతనంగా ఎన్నికైన మల్లెల రాణిని బుధవారం పలు పార్టీల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్, డైరెక్టర్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, సాగర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.